
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 20 జూన్ 2024



## చెట్లు విరిగి..
## విద్యుత్ స్తంభాలు నేలకొరిగి..

- ఇచ్ఛాపురంలో గాలీవాన బీభత్సం
- దెబ్బతిన్న వాహనాలు
- విద్యుత్ అంతరాయంతో ప్రజల ఇక్కట్లు



ఆటోపై విరిగిపడిన చెట్టు

**ఇచ్ఛాపురం, జూన్ 19:** ఇచ్ఛాపురంలో మంగళవారం అర్ధరాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రి 2 గంటల నుంచి 3 గంటల వరకు విరుచుకుపడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తీవ్రగాలులతో ఎక్కడికక్కడే చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పట్టణ అంతా అంధకారం నెలకొంది. మునిసిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పాతబస్టాండ్ జంక్షన్‌తోపాటు పలుచోట్ల భారీ చెట్లు నేలకూలడంతో పాటు 11 విద్యుత్ స్తంభాలు కుప్పకూలాయి. ఇంటిపైకప్పు రేకులు, రోడ్డుపైన ఉన్న బైకులు కూడా ఎగిరి పడ్డాయి. ఫకీరుపేటలో ఓ వైద్యుడి కారుపై భారీ చెట్టు పడడంతో ముందు భాగం దెబ్బతింది. పలుచోట్ల ఆటోలపై కూడా చెట్లు పడడంతో వాటికి కూడా నష్టం వాటిల్లింది. మంగళవారం రాత్రి 11 గంటల నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మంచినీటి కోసం పట్టణవాసులు ఇబ్బందులుకు గురయ్యారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో ఆ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట రోడ్డుపై పడిన చెట్టు



ఇచ్ఛాపురం పార్క్ వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం



కారుపై పడిన చెట్టు

# విద్యుత్ వ్యవస్థ గాడిన పడేనా?

- గడచిన ఐదేళ్లుగా అస్తవ్యస్తం
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభాలు
- కూటమి సర్కారుపైనే ఆశలు



సోంపేట మండలం తాళ్లభద్రలో ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభాల దుస్థితి ఇది. ఒకపక్కకు వాలిపోవడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళనలో గ్రామస్థులు ఉన్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు చెబుతుంటే కాలయాపన చేస్తున్నారే తప్ప పూర్తిస్థాయి పనులు చేపట్టడం లేదు.

**సోంపేట, జూన్ 19:**

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏ శాఖ కూడా సక్రమంగా పని చేయలేదు. మరీ ముఖ్యంగా విద్యుత్ శాఖ అస్తవ్యస్తంగా మారింది. టెక్కలి డివిజన్‌లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ముఖ్యంగా తితలీ తుఫాన్ సమయంలో దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పటిష్ఠం చేసేందుకు జగన్ సర్కారు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2018 అక్టోబరు 11న తితలీ తుఫాన్ జిల్లాపై పంజా విసిరింది. ప్రధానంగా ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల పరిధిలో 169 గ్రామాలు ఆనవాళ్లు కోల్పోయి దారుణంగా దెబ్బతిన్నాయి. పాతపట్నం నియోజకవర్గానికి సైతం నష్టం జరిగింది. వేల సంఖ్యలో జీడి, కొబ్బరి చెట్లు నేల కొరిగాయి. వరి పంట కూడా దెబ్బతింది. ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థకు అపార నష్టం వాటిల్లింది. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి, పాతపట్నం, సారవకోట, జలుమూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, కొత్తూరు మండలాల్లో దాదాపు లక్ష వరకు విద్యుత్ స్తంభాలు, 10 వేల వరకు ట్రాన్స్‌ఫార్మర్లు నేల కూలాయి. నాటి సీఎం చంద్రబాబు, అప్పటి మంత్రి లోకేష్‌తో పాటు కేబినెట్ లోని మంత్రులు ఇక్కడే ఉండి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 36 రోజుల తరువాత పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పనిలో పనిగా పొలాలు, చెరువులు, తోటలు వెంబడి ఉన్న విద్యుత్ లైన్లను మార్చారు. లక్షలాది విద్యుత్ స్తంభాలను రహదారుల వెంబడి ఏర్పాటు చేశారు. అప్పటివరకూ ఉన్న విద్యుత్ సమస్యలకు చెక్ చెబుతూ రోడ్ల వెంబడి లైన్లను ఏర్పాటు చేయడంతో జిల్లా ప్రజలు ఎంతగానో ఆనందించారు. కానీ, అప్పట్లో యుద్ధ ప్రాతిపదికన పనులు జరగడంతో విద్యుత్ సరఫరాకే ప్రాధాన్యమిచ్చారు. కానీ శాశ్వత పనులు చేపట్టేందుకు సమయం లేదు. అక్కడకు కొద్దిరోజులకే ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడం జరిగిపోయింది. కానీ అప్పట్లో ఆదరాబాదరాగా చేసిన వాటికి మెరుగైన పనులు చేపట్టడంలో వైసీపీ ప్రభుత్వం విఫల మైంది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో విద్యుత్ వ్యవస్థ గాడిన పడుతుందనే ఆశాభావం ప్రజలు వ్యక్తంచేస్తున్నారు.

### ఎప్పుడు కూలిపోతాయో?

ప్రస్తుతం రోడ్ల వెంబడి ఉన్న హైటెన్షన్ వైర్లు భయపెడుతున్నాయి. చాలావరకూ స్తంభాలకు సపోర్టింగ్ వైర్లు లేక ఒక వైపు వేలాడుతున్నాయి. ప్రస్తుతం ఈదురుగాలులు వీస్తుండడంతో ఎప్పుడు కూలిపోతా యో తెలియని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి హైటెన్ష న్ విద్యుత్ లైన్లకు సంబంధించి స్తంభాల మధ్య 50 మీటర్ల నిడివి ఉండాలి. కానీ అప్పట్లో యుద్ధప్రాతి పదికన పనులు కావడంతో ఈ నిబంధన పాటించ లేదు. ప్రతీ స్తంభం నాలుగు అడుగుల లోతులో పాతాలి. సమపాళ్లలో కాంక్రీట్ వేసి బలోపేతం చేయాల్సి ఉన్నా కాంక్రీట్ వేయలేదు. స్తంభం విడిచి స్తంభానికి సపోర్టింగ్ వైరు, అలాగే ఫీజు బాక్సు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన స్తంభానికి సపోర్టుగా మరో స్తంభాన్ని అడ్డంగా ఏర్పాటు చేయాలి. కానీ ఇవేవీ చేయలేదు. దీంతో ఎక్కడికక్కడే స్తంభాలు గాల్లో వేలాడుతున్నాయి. ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో రహదారులపై ప్రయాణించే వారు, వాహన చోదకులు భయపడిపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నత శాఖ అధికారులు స్పందించాలని కోరుతున్నారు. లేకుంటే జరగరాని ప్రమాదం జరిగితే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

### క్షణక్షణం భయమే..



మా గ్రామానికి మందస మండ లం హరిపురం సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. అప్పట్లో పొలాల నుంచి విద్యుత్ లైన్ ఉండేది. చాలా ఇబ్బందులు పడేవా ళ్లం. చిన్నపాటి వర్షానికే ఇబ్బందులు ఎదురయ్యేవి. తితలీ తుపానుతో రోడ్డు వెంబడి లైన్ మార్చడంతో కష్టాలు తీరాయి. కానీ, అప్పట్లో యుద్ధప్రాతిపదికన వేసిన లైన్‌ను గత ప్రభుత్వం పటిష్ఠం చేయలేదు. దీంతో ఎప్పుడు స్తంభాలు కూలిపోతాయో అని క్షణక్షణం భయంతోనే రాకపోకలు సాగిస్తున్నాం.

-బిన్నాళ జగన్నాథరావు, తాళ్లభద్ర



సోంపేట మండలం తాళ్లభద్రలో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

# ఘోర ప్రమాదం

- ఆగివున్న లారీని ఢీకొన్న మరో లారీ
- డ్రైవర్, క్లీనర్ దుర్మరణం




లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్ సిబ్బంది

**టెక్కలి, జూన్ 19:** జాతీయ రహదారిపై విక్రంపురం సమీపంలో బుధవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. హైవే పక్కన ఆగివున్న ఓ లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొంది. ఈ ఘటనలో వెనుక లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ దుర్మరణం చెందారు. బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో టెక్కలి మండలం విక్రంపురం సమీపంలో ఓ లారీని ఆపి డ్రైవర్, క్లీనర్ బహిర్భూమికి వెళ్లారు. అదే సమయంలో పలాస నుంచి కాకినాడ వైపు వెళ్తున్న మరో లారీ ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న ఇంకొక వాహనాన్ని తప్పించబోయి ఆగిఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో వెనుక లారీలో ఉన్న అస్సాం రాష్ట్రానికి చెందిన డ్రైవర్ హసద్ అలీ (42), క్లీనర్ నూరల్ ఇస్లామ్(35) అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎన్‌హెచ్ఏఐ అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్, క్లీనర్ కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు. ఎస్ఐ లక్ష్మి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'పారిశ్రామికవాడ'కు
# మోక్షం లభించేనా?

- పరిశ్రమల స్థాపనపై యువ పారిశ్రామికవేత్తల ఆసక్తి
- కూటమి ప్రభుత్వం ప్రోత్సహించాలని విజ్ఞప్తి



ప్రస్తుతం పలాస వద్ద ఉన్న పారిశ్రామికవాడలో జీడి పరిశ్రమల సముదాయం

(పలాస)

జిల్లాకేంద్రం తర్వాత అభివృద్ధి చెందుతున్న పలాస-కాశీబుగ్గలో పారిశ్రామికవాడ కారిడార్‌పై వ్యాపారులు గంపెడాశతో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పరిశ్రమల స్థాపన కోసం రామకృష్ణాపురం గ్రామం వద్ద జాతీయ రహదారికి ఆనుకుని 200 ఎకరాల వరకూ భూమి సేకరించింది. భావనపాడు పోర్టు అభివృద్ధి జరిగితే.. కొత్తగా పరిశ్రమలు నిర్మించడానికి పలాస అనువైన ప్రాంతంగా భావించి స్థల సేకరణ చేపట్టింది. అయితే పోర్టు కాస్త మూలపేటకు వెళ్లిపోవడంతో ఇక్కడ పరిశ్రమ స్థలాలపై స్తబ్ధత ఏర్పడింది. ప్రస్తుతం సంతబొమ్మాళి, టెక్కలి, కోటబొమ్మాళి ప్రాంతాల్లో వివిధ కంపెనీలు స్థాపించడానికి స్థలాలు వెతుకుతున్నారు. ఇదిలా ఉండగా పలాస ప్రాంతంలో ఇప్పటికే 20 ఏళ్ల నుంచి జీడి పారిశ్రామికవాడ నడుస్తోంది. దీనికి అనుసంధానంగా కొత్త పారిశ్రామికవాడ ఆవశ్యకత ఉంది. పోర్టుతో సంబంధం లేకుండా పరిశ్రమలు స్థాపించేందుకు యువ పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపిస్తున్నారు. రామకృష్ణాపురం వద్ద సేకరించిన భూములన్నీ ప్రభుత్వానికి చెందినవి కావడంతో మార్కెట్ ధరకు పారిశ్రామికవేత్తలకు ఇచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు గత ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించగా వెయ్యికి పైగా పోగయ్యాయి. అయితే మొత్తం జీడి పరిశ్రమలకు ఇవ్వడం కుదరదని, 50ఎకరాలు ఇవ్వడానికి అభ్యంతరాలు లేవని ఏపీఐఐసీ తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం పారిశ్రామికవాడలో కేవలం 40 జీడి పరిశ్రమలు మాత్రమే ఉన్నాయి. అందులో అద్దె ప్రాతిపదికన అనేకమంది వ్యాపారాలు చేయాల్సి వస్తోంది. కొత్త పారిశ్రామికవాడకు టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి అనుమతి ఇచ్చి వాటిని ఏపీఐఐసీ ద్వారా అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇప్పటికే స్థల సేకరణ పూర్తి కావడంతో మిగిలిన పని సులభంగా చేయవచ్చని వ్యాపారులు భావిస్తున్నారు. మొత్తం సేకరించిన భూమంతా నియోజకవర్గంలో ఉన్న ఔత్సాహిక జీడి పారిశ్రామికవేత్తలకు అందిస్తే పరిశ్రమల సముదాయమంతా ఆ ప్రాంతంలో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంది. జిల్లాలో పైడిభీమవరం వద్ద ఔషధ కంపెనీలన్నీ ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కావడంతో ఆ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. అదేమాదిరి రామకృష్ణాపురం వద్ద మొత్తం జీడి పరిశ్రమలు నెలకొల్పితే.. జీడి పారిశ్రామిక ప్రాంతంగా జిల్లాలో మంచి గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. దీనిపై టీడీపీ కూటమి ప్రభుత్వం ఆలోచించి.. పరిశ్రమ స్థాపనకు అవకాశాలు కల్పించాలని యువ పారిశ్రామిక వేత్తలు కోరుతున్నారు.

# గిరిజన విద్యార్థుల ఆరోగ్యానికి పెద్దపీట

- ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకానికి ప్రభుత్వ నిర్ణయం
- గిరిజన సంఘాలు, తల్లిదండ్రుల్లో ఆనందం
- వినతులు ఇచ్చినా పట్టించుకోని గత సర్కారు



ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

**మెళియాపుట్టి, జూన్ 19:** గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. గిరిజన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గుమ్మిడి సంధ్యారాణి ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకంపై తొలి సంతకం చేశారు. దీనిపై గిరిజన సంఘాలు నేతలతో పాటు విద్యార్థుల తల్లిండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 29 ఆశ్రమ పాఠశాలలతో పాటు గిరిజన గురుకుల కళాశాల, గిరిజన గురుకుల పాఠశాల, ఏకలవ్య పాఠశాల ఉన్నాయి. ఈ వసతి గృహాల్లో సుమారు 7 వేల మంది విద్యార్థులు ఉంటున్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరి ఆరోగ్యం పేరుతో 150 మంది వరకు ఆరోగ్య కార్యకర్తలను నియమించారు. వీరు వసతిగృహాల్లో ఉంటూ విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేవారు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడే విద్యార్థులకు సమీప ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం అందించేవారు. విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకునేవారు. విద్యార్థుల ఆరోగ్యకార్డుల్లో వారి వివరాలు నమోదు చేసేవారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు కూడా ధైర్యంగా ఉండేవారు. అయితే, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆరోగ్య కార్యకర్తల సేవలను నిలుపుదల చేసింది. దీంతో జ్వరం కానీ ఇతర అత్యవసర పరిస్థితుల్లో గానీ విద్యార్థులను ఆస్పత్రులకు తీసుకువెళ్లేవారు కరువయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య బాధ్యత సచివాలయ ఏఎన్ఎంలపై ఉండేది. ఒకపక్క గ్రామాల్లో ఆరోగ్య కార్యక్రమాలు చూస్తూ మరోపక్క వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని చూసుకునేవారు. దీనివల్ల విధుల నిర్వహణ వారికి భారంగా ఉండేది. ఫలితంగా విద్యార్థులకు సక్రమంగా సేవలు అందేవి కావు. గత ఏడాది భరణికోట, మెళియాపుట్టి కేజీబీవీల్లో అనారోగ్యానికి గురై విద్యార్థులు మృతి చెందారు. దీనిపై గిరిజన సంఘాలు ఆందోళనలు చేశాయి. ఆశ్రమ వసతి గృహాల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం కనిపించలేదు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం వసతిగృహాల్లో ఏఎన్ఎంల నియామకానికి నిర్ణయం తీసుకుంది. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

### గత ప్రభుత్వం పట్టించుకోలేదు..

గత వైసీపీ ప్రభుత్వం గిరిజన విద్యార్థుల ఆర్యోగాన్ని పట్టించుకోలేదు. వసతి గృహాల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని అధికారులకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదు. దీనివల్ల ఎందరో గిరిజన విద్యార్థులు అనారోగ్యానికి గురై మృత్యువాతపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిరిజన శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న సంధ్యారాణి గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుకోవటం ఆనందంగా ఉంది.

-సవర కుమార్, గిరిజన సంఘ నాయకుడు

# అక్రమ వసూళ్లు నిజమే

- ఆదిత్యాలయంలో శాశ్వత ఉద్యోగాల పేరిట టోకరాపై డీసీ విచారణ
- బాధితులు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు



దినసరి ఉద్యోగులను విచారిస్తున్న డీసీ సుజాత

**అరసవల్లి/శ్రీకాకుళం, క్రైమ్ 19:** ఆదిత్యాలయంలో దినసరి వేతనంపై పనిచేస్తున్న సిబ్బందికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు అక్రమ వసూళ్లకు పాల్పడడం వాస్తవమేనని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత స్పష్టం చేశారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'నీకు పర్మినెంట్ గ్యారెంటీ' అనే కథనంపై సంబంధిత అధికారులు స్పందించారు. దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత (విశాఖపట్నం) తన సిబ్బంది ప్రసాదరావు పట్నాయక్, విజయకుమార్‌తో కలిసి బుధవారం ఆదిత్యాలయంలో విచారణ చేపట్టారు. దినసరి ఉద్యోగులను ఒక్కొక్కరిని పిలిపించి, ట్రస్టుబోర్డు గదిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విచారించారు. వారి నుంచి వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా డీసీ సుజాత మాట్లాడుతూ.. శాశ్వత ఉద్యోగాల పేరిట మోసపోయిన దినసరి ఉద్యోగుల్లో కొందరు వాస్తవాలు వెల్లడించేందుకు భయపడుతున్నట్లు గుర్తించామన్నారు. ఆలయానికి వచ్చి ఫిర్యాదు చేయలేని బాధితులు నేరుగా విశాఖపట్నంలోని తన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. దినసరి ఉద్యోగులకు శాశ్వత నియామకపత్రాలు అందిస్తామని చెప్పి వారి నుంచి సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు రూ.లక్షల్లో వసూలు చేసి బదిలీపై వెళ్లిపోవడం వాస్తవ మేనని తేలిందన్నారు. విచారణ రిపోర్టును దేవదాయశాఖ కమిషనర్ (విజయవాడ)కు పంపిస్తామన్నారు. విచారణ కొనసాగుతుందని, మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.



దిక్సూచి
DIKSUCHI

# 'కథక్ కేంద్ర'లో నృత్యం, సంగీతం

న్యూఢిల్లీలోని కథక్ కేంద్ర(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కథక్ డ్యాన్స్)- సంగీతం, కథక్ నృత్యం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హిందీ మాధ్యమంలో బోధన ఉంటుంది. అభ్యర్థులకు హిందీ, ఇంగ్లీష్ భాషలు చదవడం, రాయడం తెలిసి ఉండాలి. అడ్మిషన్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు స్టయిపెండ్ సౌకర్యం ఉంది.

**కథక్ డ్యాన్స్:** ఇందులో రెండు ఎలిమెంటరీ కోర్సులు, నాలుగు అడ్వాన్స్‌డ్ కోర్సులు ఉన్నాయి.

- **ఎలిమెంటరీ కోర్సులు:** అయిదేళ్ల ఫౌండేషన్ కోర్సు, మూడేళ్ల డిప్లొమా కోర్సు
- **అడ్వాన్స్‌డ్ కోర్సులు:** ఏడాది వ్యవధిగల ప్రిపరేటరీ ఫేజ్ కోర్సు, మూడేళ్ల డిప్లొమా ఆనర్స్ కోర్సు, రెండేళ్ల పోస్ట్ డిప్లొమా కోర్సు, ఆర్నెల్ల రిఫ్రెషర్ కోర్సు.

**సంగీతం:** ఇందులో ఏడాది వ్యవధిగల సర్టిఫికెట్ కోర్సు(తబలా/పఖవాజ్/సారంగి/ఓకల్), మూడేళ్ల డిప్లొమా స్పెషల్ కోర్సు(తబలా/పఖవాజ్/సారంగి/ఓకల్) ఉన్నాయి.

**నృత్యం కోర్సులకు అర్హత:** ఫౌండేషన్ కోర్సులో ప్రవేశానికి కనీసం మూడోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. కథక్ నృత్యంలో పరిచయం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

- డిప్లొమా కోర్సులో ప్రవేశానికి కనీస తొమ్మిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 15 నుంచి 20 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. సంగీతం, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్‌లో ఆసక్తి/అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- డిప్లొమా ఆనర్స్ కోర్సులో ప్రవేశానికి ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా (కథక్) పూర్తి ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 19 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. హిందుస్థానీ ఓకల్ మ్యూజిక్, తబల/పఖవాజ్ శిక్షణ పొందినవారికి; లిటరేచర్, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- పోస్ట్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా ఆనర్స్(కథక్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు జూన్ 1 నాటికి 21 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి. లిటరేచర్, విజువల్ ఆర్ట్స్‌లో ఆసక్తి ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- రిఫ్రెషర్ కోర్సులో ప్రవేశానికి పోస్ట్ డిప్లొమా కోర్సు పూర్తిచేసి ఉండాలి. డ్యాన్స్ టీచర్‌గా పనిచేస్తూ ఉండాలి. అభ్యర్థుల వయసు జూన్ 1 నాటికి 40 ఏళ్లలోపు ఉండాలి.

**సంగీతం కోర్సులకు అర్హత:** సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి అభ్యర్థులకు జూన్ 1 నాటికి 19 నుంచి 21 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఓకల్ మ్యూజిక్‌లో అవగాహన తప్పనిసరి.

- డిప్లొమా స్పెషల్ కోర్సులో ప్రవేశానికి అభ్యర్థులకు 20 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఓకల్ మ్యూజిక్‌లో పరిజ్ఞానం ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** నృత్యంలో ఎలిమెంటరీ కోర్సులకు జూలై 2, 3, 4; నృత్యంలో అడ్వాన్స్‌డ్ కోర్సులు, సంగీతం కోర్సులకు జూలై 8, 9, 10
- **ఈ-మెయిల్:** admission@kathakkendra.in
- **వెబ్‌సైట్:** www.kathakkendra.in

# ఐఐటీ ఇండోర్‌లో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ

ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోసైన్సెస్ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్- 'ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ బయోటెక్నాలజీ(జీఏటీ) 2024 స్కోర్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. అడ్మిషన్ పొందినవారికి నెలకు రూ.5,000ల ఫెలోషిప్ ఇస్తారు. రీసెర్చ్‌పై ఆసక్తి గల అభ్యర్థులు మూడో సెమిస్టర్‌లో ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లోకి మారవచ్చు.



**అర్హత వివరాలు:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడు/నాలుగు/అయిదేళ్ల డిగ్రీ(బయాలజీ/బయోటెక్నాలజీ/అగ్రికల్చర్-బయాలజీ ఒక సబ్జెక్టుగా) ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ బయోటెక్నాలజీ(జీఏటీ) 2024 అర్హత పొంది ఉండాలి. పీహెచ్‌డీలోకి మారాలనుకునేవారు సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ జేఆర్ఎఫ్ అర్హత పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 21
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు, సర్టిఫికెట్‌లు; జీఏటీ-బీ 2024 ర్యాంక్ కార్డ్; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు; అభ్యర్థి ఫొటో, సంతకం
- **వెబ్‌సైట్:** www.iiti.ac.in

# ఉస్మానియా వర్సిటీలో ఇంటర్న్‌షిప్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'ప్రొఫెసర్ టీనవనీత రావు సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం- నాలుగో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి వారం. ఇందులో రీసెర్చ్ టెక్నిక్స్, టెక్నికల్ స్కిల్స్‌కు సంబంధించి శిక్షణ ఇస్తారు. జూన్ 24 నుంచి 29 వరకు ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు శిక్షణ తరగతులు, వర్క్‌షాప్‌లు ఉంటాయి. లైఫ్ సైన్సెస్, ఫార్మసీ, కెమిస్ట్రీ విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు, పీహెచ్‌డీ స్కాలర్స్, పీజీ స్టూడెంట్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 40 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత రుసుం చెల్లించి వర్సిటీ గెస్ట్ హౌస్‌లో వసతి సౌకర్యం పొందవచ్చు. అభ్యర్థులందరూ ల్యాబ్ కోట్, మాస్క్ వెంట తెచ్చుకోవాలి. ప్రోగ్రామ్ చివరలో అభ్యర్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తారు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.3,500
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 23
- **ఈ-మెయిల్:** cfrdou@gmail.com
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/475qNlnలో చదవండి.

# కొండా లక్ష్మణ్ వర్సిటీలో హార్టికల్చర్ డిప్లొమా

ములుగు(సిద్దిపేట్)లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ)- 'డిప్లొమా ఇన్ హార్టికల్చర్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఒక్కో కళాశాలలో 40 చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో 60 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 40 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయించారు. తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్/పదోతరగతి మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

**ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు**

- ఆదిలాబాద్ హార్టికల్చర్ పాలిటెక్నిక్
- రామగిరిఖిల్లా హార్టికల్చర్ పాలిటెక్నిక్
- కొల్లాపూర్ హార్టికల్చర్ పాలిటెక్నిక్

**అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలలు**

- గంట గోపాల్ రెడ్డి హార్టికల్చర్ పాలిటెక్నిక్-గడ్డిపల్లి, సూర్యాపేట్ జిల్లా
- విశ్వధరణి హార్టికల్చర్ పాలిటెక్నిక్-తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా



**అర్హత:** అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ పాలిసెట్ 2024లో అర్హత పొంది ఉండాలి. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/టీఓఎస్ఎస్ నుంచి సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా పదోతరగతి పూర్తిచేసినవారు, ఇంటర్ ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్/హయ్యర్ డిగ్రీ కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** www.skltshu.ac.in

# దామోదరం సంజీవయ్య వర్సిటీలో ఎల్ఎల్‌బీ

విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ(డీఎస్ఎన్ఎల్‌యూ)- ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. దేశవ్యాప్తంగా వర్సిటీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్(డీఈటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

**సీట్ల వివరాలు:** మొత్తం 138 సీట్లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కేటగిరీ కింద 66 సీట్లు, ఆలిండియా కేటగిరీ కింద 54 సీట్లు, మిగిలినవి వేరే కేటగిరీలకు కేటాయించారు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,500; బీసీ, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1800
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **ఈ-మెయిల్:** admissions@dsnlu.ac.in
- **వెబ్‌సైట్:** https://dsnlu.ac.in





# నా కెరీర్‌లో కల్కి లాంటి సినిమా చేయలేదు

అమితాబ్ బచ్చన్

'కల్కి 2898 ఏడీ' చిత్రంలో భాగమవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇదో కొత్త ప్రపంచం, నా కెరీర్‌లో ఇప్పటిదాకా ఇలాంటి సినిమా చేయలేదు. 'కల్కి' చిత్రీకరణలో అనుభవాలను ఎప్పటికీ మర్చిపోలేను' అని అమితాబ్ బచ్చన్ అన్నారు.

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రమిది. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ సహా పలువురు అగ్రనటులు కీలకపాత్రలు పోషించారు. దీపికా పదుకొనే, దిశాపటానీ కథానాయికలు. వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ నిర్మించారు. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం ముంబైలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ 'ఓ వినూత్నమైన చిత్రానికి రూపకల్పన చేసిన నాగ్ అశ్విన్, అతని బృందానికి నా అభినందనలు. ఆయన ఈ కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. అయన ఇలాంటి కథని ఎలా ఆలోచించగలిగాడో అనిపించింది. ఈ చిత్రంలో విజువల్స్ అసాధారణంగా ఉంటాయి. తన ఆలోచనలను తెరపైన అద్భుతంగా ఆవిష్కరించగలిగాడు. ఈ ఫ్యూచరిస్టిక్ ప్రాజెక్ట్ ఓ మహా అద్భుతం' అని నాగ్ అశ్విన్‌ను ప్రశంసించారు.




తన పాదాలకు నమస్కరించబోతున్న అమితాబ్‌ను వారిస్తున్న అశ్వనీదత్

కమల్‌హాసన్ మాట్లాడుతూ 'నాగ్ అశ్విన్ కూడా మా గురువుగారు బాలచందర్‌లా సాదాసీదాగా కనిపిస్తాడు కానీ అసాధారణ ప్రజ్ఞావంతుడు. తన ఆలోచనలను సృజనాత్మకంగా తెరకెక్కించగల నేర్పు నాగ్ అశ్విన్‌లో అపారంగా ఉంది. ఇందులో ప్రతినాయక ఛాయలున్న పాత్ర నాది. మంచి వినోదం పంచుతుంది. నా ఫస్ట్‌లుక్‌లానే సినిమా కూడా మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది' అన్నారు.

ప్రభాస్ మాట్లాడుతూ 'దిగ్గజాలతో పనిచేసే అవకాశం కల్పించిన అశ్వనీదత్, నాగీకి ధన్యవాదాలు. దేశవ్యాప్తంగా పాపులారిటీ సాధించిన తొలి భారతీయ నటుడు అమితాబ్‌బచ్చన్. ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. నా చిన్నప్పుడు కమల్‌హాసన్ గారి సినిమాలు చూసి ఆయనలా నటించేవాణ్ని. దీపిక అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. ఇంతమంది గొప్ప నటులతో కలసి నటించానంటే నమ్మలేకపోతున్నాను' అని చెప్పారు. దీపికా పదుకొనే మాట్లాడుతూ 'నాగీ క్రియేట్ చేసిన మ్యాజిక్ 'కల్కి' చిత్రం. ఆయనో జీనియస్. తనలో చాలా స్పష్టత ఉంది. సినిమాను అద్భుతంగా తీశారు. నటిగా నాకు గొప్ప అనుభవం మిగిల్చిన సినిమా ఇది' అన్నారు. అశ్వనీదత్ మాట్లాడుతూ 'అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, ప్రభాస్, దీపిక సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించినందుకు ఆనందంగా ఉంది. 'కల్కి' గొప్ప విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను' అన్నారు.

# కూల్ అవ్వండి మేడం గారు



విభిన్న భాషల్లో సినిమాలు చేస్తూ నటుడిగా జాతీయ స్థాయిలో చక్కని గుర్తింపు సొంతం చేసుకున్నారు దుల్కర్ సల్మాన్. తెలుగులోనూ 'మహానటి', 'సీతారామం' లాంటి చిత్రాలతో విజయాలను అందుకున్నారు. ఆయన తాజాగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్‌మెంట్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. 'లక్కీ భాస్కర్' చిత్రంలో బ్యాంక్ క్యాషియర్‌గా మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో దుల్కర్ సల్మాన్ కనిపించనున్నారు. ఈ చిత్రం నుంచి 'కోపాలు చాలండి శ్రీమతి గారు...కొంచెం కూల్ అవ్వండి మేడం గారు' అంటూ సాగే గీతాన్ని యూనిట్ బుధవారం విడుదల చేసింది. జీవీ ప్రకాశ్ కుమార్ ప్రత్యేక శైలిలో స్వరపరిచిన ఈ గీతాన్ని విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్‌లు ఆలపించారు. శ్రీమణి సాహిత్యం ఈ గీతానికి ప్రత్యేకాకర్షణగా నిలిచింది. దుల్కర్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నిమిష్ రవి, ఎడిటర్:నవీన్ నూలి

# ఎస్‌కే 30 షురూ



ఇప్పటిదాకా లవ్‌స్టోరీలు, మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌లతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సందీప్ కిషన్ తన పంథా మార్చారు. తన కెరీర్‌లో చేయని సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన హీరోగా రూపొందుతున్న 30వ చిత్రం (ఎస్‌కే 30)లో ఓ సరికొత్త పాత్రలో అలరించబోతున్నారు. ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలు చుట్టూ అల్లుకున్న కథ ఇది. బుధవారం ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పలు బ్లాక్‌బస్టర్ ఎంటర్టైనర్‌లను అందించిన త్రినాథరావు నక్కిన 'ఎస్‌కే 30'కు దర్శకత్వం వహిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ కలయికలో రాజేశ్ దండా భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. రావు రమేశ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రసన్నకుమార్ బెజవాడ కథ, మాటలు అందిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీత సారథ్యం వహిస్తున్నారు. డీవోపీ: నిజార్ షఫీ. ఎడిటర్: చోటా కే ప్రసాద్. బాలాజీ గుత్తా సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# ఆధ్యాత్మిక అంశాలతో...



అశ్విన్‌బాబు, అర్బాజ్‌ఖాన్, దిగంగనా సూర్యవంశీ ప్రధాన తారాగణంగా రూపొందుతున్న చిత్రం 'శివం భజే'. బ్రహ్మాజీ, దేవి ప్రసాద్, కాశీ విశ్వనాథ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. అప్సర్ దర్శకత్వంలో మహేశ్వర్‌రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. బుధవారం 'శివంభజే' టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఆధ్యాత్మిక అంశాలకు యాక్షన్ హంగులను మేళవించి రూపొందించిన చిత్రమిదని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. జూలైలో 'శివం భజే'ను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. టైటిల్‌తోనే మా సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం:వికాస్ బడిస, సినిమాటోగ్రఫీ: దాసరథి శివేంద్ర

# 'నింద' అందరికీ నచ్చుతుంది



'కాంద్రకోట మిస్టరీ' అని మా సినిమా పోస్టర్ వదిలినప్పుడు అందరూ ఇది ఘోస్ట్ సినిమా అనుకున్నారు. టీజర్ తర్వాత అందరికీ ఓ క్లారిటీ వచ్చింది. వరుణ్ సందేశ్‌కు ఇది తగిన క్యారెక్టర్. ఆయనకు ఇది కమ్ బ్యాక్ సినిమా అవుతుంది' అన్నారు రాజేశ్ జగన్నాథం. వరుణ్‌సందేశ్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'నింద' చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఈ కథ మీద నాకు నమ్మకం ఉంది. నిర్మాతల కోసం ప్రయత్నించా. ఆ తర్వాత వేరే వాళ్లు ఎందుకని నేనే నిర్మాతగా మారా. నాకు క్రియేటివ్ ఫీల్డ్ అంటే ఇష్టం. దర్శకత్వ శాఖ నాకు నచ్చింది. సినిమా తీయడం ఇష్టం కూడా. అయితే తీసిన సినిమాను విడుదల చేయడం ఎంత కష్టమో ఇప్పుడు అర్థమవుతోంది' అని ఆయన చెప్పారు.

# ఆర్కిటెక్ట్ నిత్య



'మనమే' చిత్రంతో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు శర్వానంద్. ఇప్పుడు తన తదుపరి చిత్రం ('శర్వా 37-వర్కింగ్ టైటిల్) షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి 'సామజ వరగమన' సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. 'ఏజెంట్' చిత్రంలో తన గ్లామర్‌తో అలరించిన సాక్షి వైద్య శర్వాకు జోడీగా నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. బుధవారం సాక్షి పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ఆమె పాత్రను పరిచయం చేసింది. ఆర్కిటెక్ట్ నిత్య పాత్రలో సాక్షి కనిపించనున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా, జ్ఞానశేఖర్ వీఎస్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాత.

# నా కెరీర్‌లో బెస్ట్ థ్రిల్లర్



నవీన్‌చంద్ర హీరోగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను హీరో నిఖిల్ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ 'ఈ కథ వినగానే నచ్చేసింది. స్క్రిప్ట్ కోసం ఇంత ప్యాషన్‌గా పని చేసిన నిర్మాతలను నేను చూడలేదు. తప్పకుండా మంచి విజయం సాధిస్తారు. నా కెరీర్‌లో బెస్ట్ థ్రిల్లర్ అవుతుంది' అని చెప్పారు. నిర్మాతల్లో ఒకరైన రేయా హరి మాట్లాడుతూ 'తెలుగులో నాకు ఇది మొదటి సినిమా. ఇందులో భాగం కావడం ఆనందంగా ఉంది' అన్నారు. 'మాకు ఇది మూడో సినిమా. మొదటి రెండు చిత్రాలూ హిట్ అయ్యాయి. తెలుగు, తమిళ భాషల్లో విడివిడిగా తీశాం. ఇది ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. అందరికీ నచ్చుతుంది' అని మరో నిర్మాత అజ్మల్ చెప్పారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ, త్వరలోనే థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేస్తామనీ నిర్మాతలు చెప్పారు.

# ఆకట్టుకునే సినిమా కథ



అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్, కృష్ణ, మంజుల హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఇట్లు.. మీ సినిమా' ఈ నెల 21న విడుదల కానుంది. నలుగురు యువకులు సినిమా మీదున్న ప్యాషన్‌తో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి ఎటువంటి సవాళ్లు ఎదుర్కొన్నారు.. అనే కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రమిది. లవ్, రొమాన్స్, కామెడీ, సెంటిమెంట్ అంశాలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి హరీశ్ చావా దర్శకుడు. నోరి నాగప్రసాద్ నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన సందర్భంగా ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దర్శకుడు హరీశ్ చావా మాట్లాడుతూ 'సినిమా కథ కోసం అన్వేషిస్తున్నప్పుడు ఏ కథో ఎందుకు.. సినిమా ఇండస్ట్రీలో పడే ఇబ్బందుల గురించి సినిమా తీద్దాం అన్నారు మా నిర్మాత. పరిశ్రమలోకి అడుగుపెట్టే వారికి అవగాహన కల్పించే విధంగా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని చెప్పారు. 'పరిశ్రమలోకి వచ్చే కొత్త వాళ్లు పడే ఇబ్బందుల్ని ఆసక్తికరంగా, ప్రేక్షకులకు నచ్చే రీతిలో చూపించాం. ఈ నెల 21న విడుదల చేస్తున్నాం. చిన్న సినిమా కనుక దయచేసి అందరూ థియేటర్లకు వెళ్లి చూడండి' అని కోరారు నిర్మాత నాగప్రసాద్. ఈ కార్యక్రమంలో హీరో అభిరామ్, హీరోయిన్ వెన్నెల, తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cyup3CB లో చదవండి.

# శివారు భూములకు సాగునీరందిస్తాం

● రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి అచ్చెన్నాయుడు

పలాసరూరల్: యుద్ధ ప్రాతిపదికన కాలువ పనులను చేపట్టి శివారు భూములకు సాగునీరందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి పట్నం గ్రామ సమీపంలోని వంశధార కాలువను బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా వంశధార నుంచి చుక్కనీరు రాలేదని, కాలువల్లో చెత్తను తొలగించి శివారు ప్రాంత ఆయకట్టుకు నీరందించేలా చర్యలు చేపడతామ న్నారు. ఆఫ్‌షోర్ పనులు ఎంతమేర జరిగాయో పరిశీలించి త్వరలో పనులు ప్రారంభిస్తామని, జిల్లాలోని రైతులకు విత్త నాలు, ఎరువులు, మత్స్యకారులకు శీతల గిడ్డంగుల ఏర్పాటు చేసి ఆయా వర్గాలకు చేయూతనందిస్తామన్నారు. వంశధార కాలువ పనులపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలాస మండల టీడీపీ నాయకులు కుత్తుమ లక్ష్మణ్, పీరికట్ల విఠల్, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్య నారాయణ, దువ్వాడ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



టెక్కలిపట్నం వద్ద వంశధార కాలువను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష, వంశధార అధికారులు

## వంతెన నిర్మాణాన్ని చేపట్టండి

నందిగాం: నందిగాం మండలం గొల్లూరు జాతీయ రహదారి నుంచి రాంపురం వెళ్లే మార్గంలో వంశధార కాలువ పై వంతెన నిర్మాణాన్ని తక్షణం చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్యకార మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం సాయంత్రం గొల్లూరు సమీపంలో వంశధార కాలువపై కూలిన వంతెన, కాలిబాట వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా నీరు విడిచిపెట్టే సమయా నికి వంతెన నిర్మాణం పూర్తవ్వాలని వంశధార టెక్కలి ఈఈ శేఖర్‌బాబుకు ఆదేశించారు. తన శాఖలకు సంబం ధించి 95శాతం ప్రజలకు సేవ చేసే శాఖలు తన ఆధీనంలో ఉన్నాయని, తద్వారా ప్రజలకు అన్ని విధాలా మేలు చేకూరుస్తానన్నారు. సర్పంచ్ జీరు రాజేశ్వరి, నానీరెడ్డి ఆధ్వర్యంలో అచ్చెన్నాయుడును సత్కరించారు. కార్యక్రమంలో నేతలు పి.అజయ్‌కుమార్, బి.శేషగిరి, కె.హరివరప్రసాద్, పి.చంద్ర శేఖర్, ఎస్.జానకిరాం, కె.ప్రసాదరావు, ఉమామహేష్, మదన్‌గౌడ్ పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలపై దృష్టిసారించాలి

మెళియాపుట్టి: గిరిజన గ్రామాల్లో తాగునీరు, రోడ్ల సమస్యలపై దృష్టి సారించి వాటికి పరిష్కారం చూపాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే మామి డి గోవిందరావును కలిసి వినతిపత్రం అందించారు. వైసీపీ ప్రభుత్వం గిరిజనులను పట్టించుకోలేదని, దీంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నందవ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నా ఒకరే ఉపాధ్యాయుడు ఉన్నారని, అదనంగా మరో ఉపాధ్యాయుడిని నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జనసేన జిల్లా కార్యవర్గ సభ్యులు సవర రామ్మూర్తి, కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించండి

పాతపట్నం: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు పరిష్కరిం చాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎంజీఆర్‌ను బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాలకు చెందిన పలు శాఖల అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలిచ్చి అభినందించారు.



ఎమ్మెల్యే గోవిందరావును అభినందిస్తున్న అధికారులు

# అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

● వైసీపీ పాలకులు.. చైర్మన్ అధికారాలు లాక్కుని దుర్వినియోగం చేశారు

● అధికారులు, కౌన్సిలర్లతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే శిరీష

పలాస, జూన్ 19: గత పాలకులు చైర్మన్ అధికారాలు, స్వేచ్ఛను సైతం లాక్కొని దుర్వినియోగం చేశా రని, తాము అటువంటి తప్పులు చేయబోమని, పట్టణాభివృద్ధే ధ్యేయం గా పనిచేస్తామని, దీనికి అధికారులు, కౌన్సిలర్లు సహక రించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత తొలిసారి బుధ వారం మునిసిపల్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కౌన్సిలర్లు ప్రభుత్వానికి సహకరించాలని, అభివృద్ధిలో తాను భాగస్వాములవుతానన్నారు. పట్టణంలోని ప్రధాన మార్గమైన కేటీ రోడ్డు విస్తరణ పనులు నాలుగేళ్లుగా పూర్తి చేయలేకపోయారని, కాలువల్లో చెత్త పేరుకపోయిందని, తక్షణం దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. తాగునీటిని పూర్తిస్థాయిలో ఎందుకు ఇవ్వలేకపోతున్నామని కమిషనర్ టి.నాగేంద్ర కుమార్‌ను ఆమె ప్రశ్నించారు. బోర్లు ఇంకిపో యాయని, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీరం దిస్తున్నట్లు కమిషనర్ ఆమె కు వివరించారు. కేదారి పురం వద్ద సమగ్ర మంచి నీటి పైపునకు మున్సిపాలిటీ నీటి పథకాలకు అనుసంధా నం చేస్తే తాగు నీటి సమ స్యకు పరిష్కారం లభిస్తుం దని ఆమె దృష్టికి తీసుకు వెళ్లగా ఈ విషయమై జిల్లా అధికారులతో మాట్లాడ తానని ఆమె చెప్పారు. అంతకు ముందు శిరీషకు చైర్మన్ బళ్ల గిరిబాబు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. కార్యక్ర మంలో వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు రెడ్డి, టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, గురిటి సూర్య నారాయణ, డిక్కల ఆనంద్, దువ్వాడ శ్రీకాంత్, పీరుకట్ల విఠల్‌రావు, కోట్ని దుర్గాప్రసాద్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి తదితరులు పాల్గొన్నారు.



పలాస: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

## రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

కాశీబుగ్గ: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బం దులు లేకుండా చర్యలు తీసుకుంటామని, విత్తనాలు, ఎరు వులు అందుబాటులో ఉన్నాయని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. చినబడాంలో వ్యవ సాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆమె రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా ప్రతీ రైతుకు ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు, ఎరువులను పంపిణీ చేస్తు న్నామన్నారు. నియోజకవర్గానికి 3163 క్వింటాలు విత్తనాలు వచ్చాయని, మంద స మండలం స్లట్ ప్లాన్ మండలంగా ఎంపిక కావడంతో గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై 560 క్వింటాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ మధుసూదనరావు, పోలారావు, నేతలు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం





టెక్కలి, నరసన్నపేటల్లో మాట్లాడుతున్న న్యాయాధికారులు చక్రవర్తి, హరిప్రియ

టెక్కలి: రాజీ మార్గమే రాజమార్గమని టెక్కలి జూనియర్ సివిల్ న్యాయాధికారి మళ్ల తేజాచక్రవర్తి అన్నారు. బుధవారం పోలీసులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 29న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నారని, అందుకు సంబంధించి రాజీపడదగ్గ కేసులు, అంశాలపై మాట్లాడారు. జాతీయ లోక్‌అదాలత్‌లో పెద్దఎత్తున క్రిమినల్ కేసులు రాజీపడేలా చూడాలని పోలీసులకు ఆదేశించారు. ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవాలని, లోక్‌అదాలత్ తీర్పు అంతిమ మన్నారు. సమావేశంలో ఏపీపీ హరిప్రియ, పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేయాలి

నరసన్నపేట: పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే రాజీ కోసం లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలని స్థానిక కోర్టు న్యాయాధికారి హరిప్రియ సూచించారు. బుధవారం కార్యాలయంలో పోలీసు, ఎస్ఈబీ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ప్రసాదరావు, ఎస్ఐలు అశోక్‌బాబు, సత్యనారాయణ, ఎస్ఈబీ ఎస్ఐ కావ్య తదితరులు పాల్గొన్నారు.

## సాగునీరందించేందుకు చర్యలు

వజ్రపుకొత్తూరు: పంట పొలాలకు సాగునీరందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు రెయ్యిపాడు ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు సూళ్ల చిట్టిబాబు అన్నారు. బుధవారం కొండవూరు సచివాలయంలో రైతులు, అధికారులతో మాట్లాడారు. సకాలంలో వంశధార నీరందించేందుకు ఎమ్మెల్యే గౌతుశిరీష కృషి చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీముఖలింగం ఆశీలు రూ. 3.23 లక్షలకు ఖరారు

జలుమూరు: శ్రీముఖలింగం పంచాయతీలో ఆశీలు వేలంపాటు రూ. 3.23 లక్షలకు ఖరారైనట్లు టెక్కలి డీఎల్పీవో గోపిబాల తెలిపారు. గ్రామ సచివాలయంలో బుధవారం సర్పంచ్ తమ్మన్నగారి సతీష్ అధ్యక్షతన మార్కెట్ ఆశీలు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన అప్పన్నబారికి రూ.3.23 లక్షలకు పాడి పాట దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ కరుకోల హరిప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పేట అభివృద్ధి చర్యలు

నరసన్నపేట: నరసన్నపేట పట్టణాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక హోడ్కోకాలనీలో సమాచార వాహినిని ప్రారంభించారు. కార్యాక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## బద్రి ఎంపీటీసీ మృతికి ఎమ్మెల్యే బగ్గు సంతాపం

జలుమూరు, (సారవకోట): బద్రి ఎంపీటీసీ, డాక్టర్ మెండ బాల చంద్రనాయుడు ఆకస్మిక మృతి పట్ల ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సంతాపం తెలిపారు. బుధవారం నాయుడు అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంత్యక్రియల్లో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, మెండ రాంబాబు, టీడీపీనాయకులు బైరి భాస్కరరావు, కత్తిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



బాలచంద్రనాయుడు మృతదేహంపై పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బగ్గు

## అవలింగిలో టీడీపీ విజయోత్సవాలు

జలుమూరు (సారవకోట): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో అవలింగి గ్రామంలో బుధవారం టీడీపీ నేతలు విజయోత్సవాలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ ఆధ్వర్యంలో టీడీపీ నేత చిన్నాల వెంకటసత్యనారాయణ కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. మధ్యాహ్నం గ్రామంలో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు బోర ధనుంజయనాయుడు, పంచిరెడ్డి రమణ, సోనేన శ్యాం, కింజరాపు జగదీష్ పాల్గొన్నారు.



కేక్ కట్‌చేసి పంచిపెడుతున్న చిన్నాల

## ఘనంగా శ్రీధర్ జన్మదిన వేడుకలు

పలాస: పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, శివాజీ నగర్ షిర్డీసాయిబాబా సంస్థాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ (బాబా) జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించారు. స్వగృహంలో అభిమానులు, కుటుం బ సభ్యుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అభిమానులు ఆయనకు బొకేలిచ్చి, స్వీట్లు పంచి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. తన ప్రాణమున్నంతవరకు పేదలందరికీ సహాయం చేస్తానని, మేలు కోరే నేతలకు అండగా ఉంటానన్నారు. శ్రీధర్‌కు ఆర్టీసీ కార్మిక సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. దువ్వాడ నవీన్‌కుమార్ చౌదరి, కూన హేమాచలం, ఉంగ అనిల్‌కుమార్, మల్లా కామేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, దువ్వాడ అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్(బాబా)కు కేక్ తినిపిస్తున్న అభిమానులు, కార్మికసంఘ నాయకులు

## బాలాజీనగర్‌కు ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

పాతపట్నం: స్థానిక బాలాజీనగర్-2 వీధికి బుధవారం ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. వీధిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని స్థానికులు మంగళవారం ఎంపీడీవో కె.రామకృష్ణరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన స్పందించి ప్రత్యక్ష పర్యవేక్షణ చేసి నీటిని సరఫరా చేయించారు ఇంటింటికీ కొళాయిలు వేసినప్పటికీ నీటి సరఫరా చేసేందుకు మరో వారం రోజులు పడుతుందని అధికారులు ఆయన దృష్టికి తీసుకుచ్చారు. కాలనీ వాసులు ఇబ్బందులు పడకుండా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కల్యాణ్, ఈవోపీఆర్డీ కృష్ణారావు, ఈవో కూర్మారావు పాల్గొన్నారు.

## ఘనంగా పండిత సదస్యం

జలుమూరు: సుప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరాలయంలో కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం పండిత సదస్యం నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పండితులు స్వామిని కీర్తించారు. అనంతరం పండితులకు అర్చకులు దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి: డీపీవో

ఎల్.ఎన్.పేట/హిరమండలం: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు ఆదేశించారు. బుధవారం ఎల్ఎన్ పేట, హిరమండలం పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, చెత్త సంపద కేంద్రాల వినియోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లతో పాటు దుకాణాల వద్ద కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను బుట్ట ల్లో వేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. రోడ్లపై చెత్తను వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డ్‌లకు తరలించి చెత్త నుంచి సంపదను సృష్టించాలని పంచాయతీ అధికారులకు సూచిం చారు. తద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం వస్తుంద న్నారు. పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహ రించే వారిపై చర్యలు తప్పవన్నారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాలను ఆరోగ్యకరంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ప్రజలపై ఉందని, ఈ దిశగా వారికి అవగాహన కలిగించాలని అధికా రులను కోరారు. ● హిరమండలం పంచాయతీ కార్యా లయంలో డీపీవోను జడ్పీటీసీ బుచ్చిబాబు కలిసి మండలంలోని సమస్యలను వివరించారు. గ్రామాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగడంలేదని, పారిశుధ్య నిర్వహణ దారుణంగా ఉందని, తగు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, మార్కెట్ యార్డు వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎస్‌బీఎం,ఐఈసీ అధికారి కె.అమ్మాజీరావు, ఎంపీడీవో జి.గిరిబాల, ఈవోపీఆర్డీలు పద్మజ, నాగమణి, ఈఓ వైఎస్ఆర్ మూర్తి, పంచాయతీల కార్య దర్శులు పాల్గొన్నారు. ● వజ్రపుకొత్తూరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉండాలని, రోడ్లు, కాలువల్లో చెత్తను వేయరాదని ఎంపీ డీవో తిరుమల రావు అన్నారు. బుధవారం డోకులపాడు పంచాయతీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాలు పడుతు న్నందున చెత్తకుప్పలు, కాలువల్లో పూడికలు తీయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్డి సరిత, కరుణాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● ఎల్.ఎన్. పేట: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బంది పై చర్యలు తప్పవని ఎంపీడీవో జి.గిరిబాల హెచ్చరించారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజ నీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఇంటింటి నుంచి సేకరించిన పొడి చెత్త, తడి చెత్తలను చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. వర్షాకాలంలో పారిశుధ్య లోపం ఏర్పడితే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండి పారిశుధ్య నిర్వహణను సక్రమంగా చేపట్టా లన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఐ.పద్మజ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ● నందిగాం: గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.రఘునాథరావు అన్నారు. బుధవారం తన కార్యాలయం లో పంచాయతీకార్యదర్శులతో సమా వేశం నిర్వహించారు. పారిశుధ్య ప్రత్యేక వారోత్సవాలను పురస్కరించుకొని గ్రామాల్లో పనులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. చెత్తసేకరణ కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సమావేశం లో ఈవోపీఆర్డీ టి.రాజారావు, డీపీఆర్సీ ఆనందరావు పాల్గొన్నారు. ● జలుమూరు: గ్రామాల్లో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని టెక్కలి డీఎల్పీవో గోపిబాల అన్నారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా జలుమూరులో చేపడుతున్న పారిశుధ్య పనులను బుధవారం పరిశీలించారు. తొలకరి వర్షాలు పడి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశ మున్నందున గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సరోజిని పాల్గొన్నారు.



లక్ష్మీనర్సుపేటజంక్షన్‌లో కిరాణాషాపుల వద్ద పరిశుభ్రం చేయిస్తున్న అధికారులు

## చెరువులు ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసన్నపేట, జూన్ 19: చెరువుల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆర్డీవో రంగయ్య అన్నారు. బుధవారం స్థానిక నరసన్నచెరువు, రెడ్డికపేటలో ఇటీవల అక్రమణలకు గురైన చిట్టెన్న చెరువులను ఆయన పరిశీలించారు. చిట్టెన్న చెరువు ఆక్రమణలపై ఈనెల 17న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీనికి ఆయన స్పందించి బుధవారం పరిశీలన చేశారు. చెరువులను పరిరక్షించే బాధ్యత వీఆర్వోలపై ఉందన్నారు. అక్రమంగా మట్టి తరలించినా అడ్డుకోవాలని సూచించారు. చిట్టెన్న చెరువు గట్టును ఆక్రమించిన వ్యక్తి నుంచి తిరిగి గట్టు వేయించి అపరాధ రుసుం వసూలు చేయాలని తహసీల్దార్ కనకారావుకు సూచించారు. చర్మాల చెరువు, నరసన్నచెరువు చెరువులను ఆక్రమించి పొలాలుగా మార్చిన వైనంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.



చిట్టెన్న చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో రంగయ్య

## ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలు తొలగించండి

నందిగాం/వజ్రపుకొత్తూరు: ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించాలని పలాస ఆర్డీవో భరత్‌నాయక్ ఆదేశించారు. బుధవారం నందిగాం, వజ్రపుకొత్తూరు తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రభుత్వ భూము ల్ని గుర్తించి ఆక్రమణలకు గురై ఉంటే వాటిని తొలగించాలని, ఈ విషయంలో అలక్ష్యం వద్దన్నారు. నర్సి పురంలో దేవాలయ భూముల్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెండికొండ వద్ద హుద్‌హుద్ తుపాన్‌బాధితుల కోసం నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. తహసీల్దార్లు వి.పద్మావతి, సురేష్, డీటీలు ఎస్.భాగ్యలక్ష్మి, వి.గిరిరాజు, సర్వేయర్లు తదితరులున్నారు.

## బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

పలాస: పలాస పట్టణంలో బుధవారం రాత్రి ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పలాస అన్నపూర్ణ ఆశ్రమం వీధికి చెందిన తంగుడు సమీర్, తంగుడు దినేష్ కాశీబుగ్గ వెళ్తుండగా, కాశీబుగ్గ నుంచి పలాస వైపు సాయి వినయ్ వస్తుండగా మెయిన్‌రోడ్డు ఆంజనేయ ఆలయం వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. వీరిలో దినేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా, తంగుడు దినేష్, సమీర్ పలాసలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయ ఆదాయం రూ.6.37.లక్షలు

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గమ్మ ఆలయానికి 43 రోజులకు గాను రూ. 6,37,167 ఆదాయం వచ్చిందని ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. ఆలయంలో బుధవారం లెక్కించారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఎన్‌జీవోలు

పలాసరూరల్: పలాస ఎన్‌జీవో ఉద్యోగులు, వైద్య సిబ్బంది బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి అభినందించారు. ఎన్‌జీవో పలాస అధ్యక్షుడు బొనెల గోపాల్, పి.శ్రీనివాసరావు, పాపారావు, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.

## ఆప్కో వస్త్రాలను వాడండి

పలాసరూరల్: ఆప్కో వస్త్రాలను వినియోగించాలని ఎంపీడీవో వైకుంఠరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆప్కో వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలను బుధవారం ప్రారంభించారు. నాణ్యత, మన్నిక కలిగిన వస్త్రాలను ఆప్కో అందజేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## నా బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తా

● ఎమ్మెల్యే రూపేష్‌కుమార్ పాణిగ్రాహి


ఒడిశా

పర్లాకిమిడి, జూన్ 19: తనకు ప్రజలు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని పర్లాకిమిడి నియోజకవర్గ ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి అన్నారు. ఆయన బుధవారం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడు తూ.. బీజేడీ తరపున పోటీ చేసిన తనను నియోజకవర్గ ప్రజలు గెలిపించారని, సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజల నమ్మ కాన్ని కాపాడుకుంటానని, నిత్యం ప్రజాసేవలో ఉంటానన్నారు.

# మినీ రిజర్వాయర్ కల నెరవేరేనా?

- అతీగతీ లేని మూడు దశాబ్దాల నాటి ప్రతిపాదన
- సాగునీరు అందక అవస్థలు
- ప్రభుత్వం మారడంతో ఆశగా రైతుల ఎదురుచూపు

ఎచ్చెర్ల: మూడు దశాబ్దాల కిందటి ప్రతిపాదన అది.. అయినా దానికి అతీగతీలేకుండా పోయింది. మినీ రిజర్వాయర్ కల నిజమైతే తమ బతుకులు బాగుపడతాయన్న రైతుల ఆశలు ఆవిరి అవుతూనే ఉన్నాయి. ఏటా పంటలు కలిసిరాకున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజాప్రతినిధులు మారుతున్నా రైతన్నల కళ్లలో మాత్రం ఆనందం కానరావడం లేదు. ఇదీ ఎచ్చెర్ల మండలం ధర్మవరం పెద్ద చెరువు కింద ఆయకట్టుదారుల దీనగాథ. రెవెన్యూ రికార్డుల ప్రకారం పెద్ద చెరువు 175.38 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువును మినీ రిజర్వాయర్‌గా మారుస్తామని ప్రజాప్రతినిధులు మూడు దశాబ్దాలుగా ఊరిస్తున్నారు. అయినా నేటికీ రైతుల ఆశ నెరవేరలేదు.



ధర్మవరం పెద్ద చెరువు

## ప్రతిపాదనకు.. 30 ఏళ్లు

ధర్మవరం పెద్ద చెరువును మినీ రిజర్వాయర్‌గా మారుస్తామన్న ప్రతిపాదన ఇప్పటిది కాదు. 1993-94లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో తొలిసారిగా వచ్చింది. జిల్లాకు చెందిన ధర్మాన ప్రసాదరావు మధ్యతరహా నీటిపారుదల శాఖామంత్రిగా, ఆనాటి చిన్నతరహా నీటి పారుదల శాఖ మంత్రి డాక్టర్ పి.శంకరరావుతో కలిసి పెద్ద చెరువును సందర్శించారు. ఆనాడు అమాత్యులు ఇద్దరూ పెద్ద చెరువును పరిశీలించడంతో రైతుల ఆశలు చిగురించాయి. ఆ తర్వాత ఆ ఊసే లేకుండా పోయింది.

## నారాయణపురం కాలువ ఉన్నా..

నారాయణపురం కుడి కాలువ కింద ఉన్న ధర్మవరం పరిసర గ్రామాలు ఉన్నా ప్రతి ఖరీఫ్ సీజన్లో సాగునీటి కష్టాలు తప్పడం లేదు. సకాలంలో సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అతికష్టమ్మీద రైతుల సహకారంతో కాలువ ద్వారా సాగునీరు అందించగలుగుతున్నారు. దీంతో అన్నదాత ఆశించిన స్థాయిలో పంటలు చేతికి అందడంలేదు. రైతులు తీవ్ర వ్యయ ప్రయాసలకు గురవుతున్నా చివరకు నిరాశే మిగులుతోంది.

## మినీ రిజర్వాయర్ ఏర్పాటైతే..

ధర్మవరం పెద్ద చెరువు కింద సుమారు 1500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో కొంత చెరువు ఆక్రమణకు గురైంది. దీని కింద ఉన్న మదుములు కూడా పాడయ్యాయి. చెరువులో నీటి నిల్వ సామర్థ్యం కూడా తగ్గింది. వర్షాకాలంలో ముద్దాడ ఊటగెడ్డ మీదుగా వర్షపు నీరు భారీగా ధర్మవరం పెద్ద చెరువులోకి చేరుతుంది. ఈ చెరువు నుంచి ఇక్కడికి సమీపంలోని బొంతలకోడూరు వద్ద సముద్రంలోకి వృథాగా కలిసిపోయిది. ఈ నీరు వృథా కాకుండా అడ్డుకట్ట వేసేందుకే మినీ రిజర్వాయర్ ప్రతిపాదన అప్పట్లో తెరపైకి వచ్చింది. మినీ రిజర్వాయర్ ఏర్పాటైతే ధర్మవరం, పొన్నాడ, కొంగరాం తదితర గ్రామాల రైతులకు ప్రయోజనం కలుగుతోంది.

## ఏటా ఇబ్బందులే



ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్లో నారాయణపురం కుడి కాలువ ద్వారా అతి కష్టమ్మీద సాగునీరు ఈ ప్రాంతానికి చేరుతుంది. పంటలు కూడా పూర్తిస్థాయిలో దిగుబడి రావడంలేదు. దీంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. మినీ రిజర్వాయర్ ఏర్పాటైతేనే ఈ ప్రాంత రైతుల కష్టాలు తీరుతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపాలి.

- ముద్దాడ వెంకటరమణ, రైతు, ధర్మవరం

## ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం



చికిత్స పొందుతున్న మహిళ, గాయపడిన చిన్నారి

పలాస, జూన్ 19: పాత జాతీయ రహదారి కిడ్నీ ఆసుపత్రి సమీపంలో బుధవారం మధ్యాహ్నం ఆటో బోల్తా పడిన ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే.. పలాస మండలం రంగోయి గ్రామం నుంచి పలాసలోని బ్యాంకు పనిపై వెలుగు గ్రామైక్య సంఘ అధ్యక్షురాలు బొంగు వనజాక్షి, గ్రామ సంఘ అధ్యక్షురాలు కుప్పిలి త్రివేణి, స్వయంశక్తి సంఘ గ్రూపు సభ్యులు బొంగి రమణమ్మ, గేదెల విజయలక్ష్మి, తెప్పల మోహినమ్మ, మచ్చ వరలక్ష్మి, వనజాక్షి, దివ్య, ఓ చంటి పాపతో ఆటోలో వస్తుండగా కిడ్నీ ఆసుపత్రి జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో వీరంతా గాయపడ్డారు. వీరిలో వనజాక్షి, రమణమ్మకు తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆటో డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బెడ్స్ లేకపోవడంపై నిరసన

పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర రోగులకు సరిపడా బెడ్లు లేకపోవడంతో చిన్నబడాం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గొనప నిరంజన్ ఆసుపత్రి వద్దే బైఠాయించి నిరసన తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళ్తున్న నిరంజన్ స్పందించి ఓ వ్యాన్‌లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో ఇద్దరిని ఒకే బెడ్‌పై ఉంచి చికిత్స అందించడంపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అనంతరం క్షతగాత్రులను వేర్వేరుగా బెడ్స్‌పై ఉంచి చికిత్స అందించారు. కాగా ఈ ఆసుపత్రిని ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందే రూ.5 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసినా రోగులకు అవసరమైన పరికరాలు లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బూర్జ: మదనాపురం గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్టు ఎస్ఐ జీవీ ప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సోహన్‌గౌడ్ (32) ప్లాస్టిక్ డబ్బాలను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం తన ద్విచక్ర వాహనంపై డబ్బాలు అమ్ముకుంటూ పాలకొండ వైపు వెళ్తుండగా.. మదనాపురం వద్ద తన వాహనాన్ని ఆపి దిగుతుండగా అదే మార్గంలో త్రిచక్ర వాహనంతో అతి వేగం వచ్చి సోహన్‌గౌడ్‌ను బలంగా ఢీకొట్టారు. దీంతో రోడ్డు మీద పడిన గౌడ్ తలకు బలమైన గాయమైంది. అతడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం జెమ్స్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరుగురిపై కేసు నమోదు

ఎచ్చెర్ల: కుశాలపురం పరిధి నవభారత్ ఏరియాలో నివాసం ఉంటున్న దాసరి మంగమ్మ అనే మహిళపై జరిగిన అమానవీయ ఘటనకు సంబంధించి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.చిరంజీవి బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం నగరానికి చెందిన మంగమ్మ తన భర్త వర్ధిరాజుతో ఉన్న విభేదాల కారణంగా కొద్ది నెలలుగా నవభారత్‌లో తన పిల్లలను పెట్టుకుని వేరేగా నివాసం ఉంటోంది. ఈ క్రమంలో మంగళవారం వ్యక్తిగత కారణాలతో శ్రీకాకుళం నగరం దమ్మలవీధికి చెందిన అల్లిబిల్లి రాధ, కోడ భవాని, లక్ష్మి, జయతో పాటు మరో ఇద్దరు వచ్చి మంగమ్మను ఈడ్చుకుంటూ ఆటోలోకి ఎక్కించి శ్రీకాకుళం నగరానికి తీసుకెళ్లారు. తోటి మహిళ అని చూడకుండా విచక్షణారహితంగా వీరంతా ప్రవర్తించారు. దీంతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఆమెను స్థానికులు శ్రీకాకుళం సర్వ జన ఆసుపత్రికి తరలించారు. ఈమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత శ్రీకాకుళం వన్ టౌన్ పోలీసులు వివరాలు నమోదు చేసి.. ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు బదలాయించారు.

## తప్పిన ప్రమాదం



రోడ్డు పక్కకు ఒరిగిన లారీ

సరుబుజ్జిలి: మండల కేంద్రమైన సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ సమీపంలో బుధవారం ఓ ఇసుక లారీకి ప్రమాదం తప్పింది. ఒడిశా నుంచి విశాఖకు ఇసుకతో వెళ్తున్న భారీ లారీ ఆలికాం-బత్తిలి (ఏబీ) రహదారిపై ఉన్న గుంతలు తప్పించబోయి రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. ఈ క్రమంలో మట్టిలో లారీ ముందు చక్రాలు కూరుకుపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రతిరోజూ ఇదే ప్రాంతంలో ఇసుక లారీలు గుంతలో కూలిపోతున్నాయి. దీంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించి ప్రతిరోజూ వాహనదారులు నరకం చూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

## షలంత్రి సచివాలయానికి తాళం



సచివాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న సర్పంచ్ భర్త గౌరునాయుడు, అర్జీదారులు

సరుబుజ్జిలి: షలంత్రి గ్రామ సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంపై సర్పంచ్ బత్తిన వరలక్ష్మి భర్త గౌరునాయుడు బుధవారం సచివాలయానికి తాళాలు వేసి మండల పరిషత్ అధికారులకు అప్పగించారు. ఉదయం 10.30 గంటల సమయంలో సర్పంచ్ కొత్త మంది అర్జీదారులతో కలిసి సచివాలయానికి వచ్చారు. అయితే అప్పటికే చాలా సమయం ఎదురుచూసినా సిబ్బంది హాజరుకాలేదు. కాసేపటికే వీఆర్ఏ వచ్చి తాళాలు తీశారు. అయినా సచివాలయ సిబ్బంది ఎవరూ విధులకు హాజరుకాకపోవడంతో ఆగ్రహించిన సర్పంచ్ భర్త గౌరునాయుడు కార్యాలయానికి తాళాలు వేశారు. ఆలస్యంగా విధులకు వచ్చిన సచివాలయ సిబ్బంది విషయం తెలుసుకొని మండల పరిషత్ కార్యాలయానికి పరుగులు తీశారు. ఎంపీడీవో, సూపరింటెండెంట్ బీవీ ప్రసాద్ ఇలా మరోసారి జరిగితే కఠిన చర్యలు తప్పవని సచివాలయ సిబ్బందిని హెచ్చరించి తాళాలు అందించారు.

## విద్యకు పెద్దపీట

సరుబుజ్జిలి: టీడీపీ పాలనలోనే అన్ని రంగాలకు చెందిన విద్యలో పెద్దపీట వేయడం జరిగిందని మండల తెలుగు యువత నాయకులు దవళ సింహాచలం, ఎండ రామారావు, కొమనాపల్లి రవికుమార్, ఇల్లాకుల ప్రభాకరరావు అన్నారు. బుధవారం సరుబుజ్జిలి, నందికొండ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ కళాశాలలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెంది దేశంలోనే విద్యాభివృద్ధిలో రాష్ట్రం అగ్రగామిగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడానికి లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు.

## రామ్మోహన్‌ది చెరగని ముద్ర



రామ్మోహన్‌కు అభినందనలు తెలుపుతున్న బీఎల్‌పీ రావు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధికి అడిగిన వెంటనే ఎంపీ నిధుల నుంచి రూ.40 లక్షలు ఇచ్చి కార్మికుల మదిలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును చెగరని ముద్ర వేసుకు న్నారని రోడ్డు రవాణా సంస్థ రిటైర్డు పీఆర్వో, ఆర్టీసీ కార్మిక పరిషత్ సంఘ రాష్ట్ర కార్యదర్శి బీఎల్‌పీ రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన ఎంపీ రామ్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. బొడ్డేపల్లి రాజగోపాల్ మాదిరిగా ఏడుసార్లు రామ్మోహన్ నాయుడు ఎంపీ అవుతారని ఆకాంక్షించేవారమని, ఆ కల నిజమవుతుండడంతో ఆర్టీసీ కార్మికుల కోరిక తీరినట్టయిందని ఆయన అన్నారు.

## విద్యార్థులకు ఉపకరణాలు

పొందూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యా ఉపకరణాలు, నాణ్యమైన కిట్లు ప్రతీ ఒక్కరికీ అందిస్తామని ఎంపీటీసీ పి.కల్యాణి, తోలాపి టీడీపీ నాయకులు పొన్నాడ రామారావు, పి.అప్పలనాయుడు అన్నారు. తోలాపి ఉన్నత పాఠశాలలో బుధవారం కిట్ల పంపిణీలో వారు పాల్గొని మాట్లాడారు. హెచ్ఎం సత్యరాజు, టీడీపీ నాయకులు పి.శ్రీనివాసరావు, పి.గంగాధరరావు, డి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్యుని సన్నిధిలో సినీ హీరో నాగచైతన్య



ఆదిత్యాలయంలో నాగచైతన్య, సాయిపల్లవి

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని సినీహీరో నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవి, దర్శకుడు చందూ మొండేటి బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదాన్ని ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ వారికి అందజేశారు. తమ అభిమాన హీరో, హీరోయిన్లను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో తోపులాట జరిగింది. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు



మాట్లాడుతున్న ఆర్ఎం సవర్కర్

ఆమదాలవలస: భారత రైల్వే సంస్థ ఆధ్వర్యంలో దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటక కేంద్రాలను సందర్శించే భక్తుల కోసం ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ సంస్థ ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు ఐఆర్‌సీటీసీ రీజనల్ మేనేజర్ క్రాంతి సవర్కర్ తెలిపారు. బుధవారం శ్రీకాకుళం రోడ్డు ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. దేశ, విదేశాల్లో పర్యటిస్తున్న ప్రయాణికులకు ఐఆర్‌సీటీ సంస్థ ద్వారా కల్పిస్తున్న వివిధ టూర్ ప్యాకేజీలను వివరించారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల నుంచి భక్తుల దైవ క్షేత్ర సందర్శనకు అయోధ్య, కాశీతో సహా ఆరు పుణ్యక్షేత్రాలకు సికింద్రాబాద్, విశాఖ నుంచి భారత్ గౌరవ ట్రైన్ నామకరణంతో రెండు రైళ్లు నడుపుతున్నట్టు ఆమె తెలిపారు. ఈ రెండు రైళ్లలో తీర్థయాత్రలకు వెళ్లే భక్తులకు ప్రత్యేక ప్యాకేజీల ద్వారా చార్జీలను అందుబాటులో ఉంచామన్నారు. భక్తులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారంతో పాటు వసతి దైవక్షేత్రాల సందర్శనలకు ప్రత్యేక అవగాహన కల్పించే గైడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ రైళ్లలో స్లీపర్ క్లాస్, థర్డ్ ఏసీ, సెకెండ్ క్లాస్, ఏసీ బోగీల ద్వారా 716 మంది ప్రయాణికులు ఉంటారని, పిల్లలకు ప్రత్యేక ప్యాకేజీలు ఉన్నాయన్నారు. రైల్వే రిజరేషన్ బుకింగ్ కౌంటర్లతో పాటు రైల్వేస్టేషన్‌లో ఉన్న జన ఆహార్ స్టాల్ వద్ద ఉన్న ఐఆర్‌సీటీసీ ప్రతినిధిని కలిసి టిక్కెట్లను బుక్ చేసుకొనే సదుపాయం ఉందన్నారు. సమావేశంలో ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటివ్ సంఘ మిత్రరావు, స్థానిక స్టేషన్ మాస్టార్ ఎం.రవి, కమర్షియల్ ఇన్‌ఛార్జి గణేష్‌తోప ఉన్నారు.

## రవికుమార్‌ను కలిసిన టీడీపీ నాయకులు



రవికుమార్‌తో కేఆర్ యూత్ ప్రతినిధులు

ఆమదాలవలస: స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను పట్టణానికి చెందిన ఐజే నాయుడు కాలనీ కేఆర్ యూత్ ప్రతినిదులు బుధవారం విజయవాడలోని రవికుమార్ స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐజే నాయుడు కాలనీ టీడీపీ ఇన్‌ఛార్జి కూన రాము మాట్లాడుతూ.. రవికుమార్‌కు మంత్రివర్గంలో స్థానం లభిస్తుందని ఆశపడ్డామని, కానీ నిరాశ కలిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు.

## డయేరియాను నిర్మూలిద్దాం

ఇచ్ఛాపురం: డయేరియా రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా నడుం కట్టాలని పలువురు అన్నారు. ఈ సందర్భంగా భవానీపురం అంగన్‌వాడీ కేంద్రం నుంచి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టి అవగాహనకల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతీ ఎకరానికి సాగునీరు అందిస్తా



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీలు

లావేరు: రాబోయే ఐదేళ్లలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందిస్తామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. బుధవారం మండల కేంద్రం లావేరులో ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయి 2024 ఖరీఫ్ వరివిత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 55 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, 37 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. మడ్డువలస కాలువ ద్వారా సాగునీరు తెప్పించి బుడుమూరు నారాయణ సాగర్‌ను మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దుతానన్నారు. నాగావళి నదీజలాలను తెప్పించి ఎస్ఎం పురం పెద్ద చెరువును రిజర్వాయర్‌గా తీర్చి దిద్దుతానన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖ మంత్రి కావడం జిల్లా రైతుల అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. అభ్యుదయ రైతులను సత్కరించారు. విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్, ఏడీఏ శ్రీనివాసరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మండల బీజేపీ అధ్యక్షుడు ఇజ్జాడ శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త విశ్వక్సేన్, ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ, జడ్పీటీసీ మీసాల సీతంన్నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ తోటయ్యదొర, మాజీ జడ్పీటీసీలు పిన్నింటి మధుబాబు, అర్.ప్రకాశరావు, టీడీపీ నాయకులు కె.రవికుమార్, గంట్యాడ మహేష్, లంక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సెబ్ ఏఈఎస్‌గా వినీషా



ఎస్పీ రాధికను మర్యాదపూర్వకంగా కలిసిన ఏఈఎస్ వినిషా

శ్రీకాకుళం క్రైం: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్)గా నియమితులైన ఎం.వినీషా బుధవారం ఎస్పీ రాధికను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీకి వినిషా పుష్పగుచ్ఛాన్ని అందించి శాఖాపరమైన విషయాలపై చర్చించారు.

### ఎస్పీని కలిసిన నూతన ఎస్ఐలు

ఇటీవల విశాఖ రేంజ్ పరిధిలో పలువురు ఏఎస్ఐలకు డీఐజీ విశాల్ గున్ని ఎస్ఐలుగా పదోన్నతులు కల్పించారు. ఈ క్రమంలో జిల్లా నుంచి ఆరుగురు పదోన్నతులు పొందారు. వీరిలో ముగ్గురుని జిల్లాకు, మరో ముగ్గురిని రేంజ్ పరిధిలో కేటాయించారు. ఈ మేరకు పదోన్నతి పొంది జిల్లాకు కేటాయించిన పి.డిల్లీరావు, పీవీ రమణ, కె.శివాజీ బుధవారం ఎస్పీ రాధికను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ తదితరులు ఉన్నారు.

## బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలి





మాట్లాడుతున్న మేనేజర్ రవికుమార్

ఆమదాలవలస: ప్రతి ఒక్కరు బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ రవికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని సాయినగర్‌లో గల ఓ ఐటీఐలో విద్యార్థులకు బ్యాంకింగ్ వ్యవస్థలపై అవగాహన కల్పించారు. ఆర్‌బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవర్నేస్ వర్క్‌షాప్‌లో భాగంగా నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ వర్క్‌షాప్‌ను సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ర్మేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ వి.అశోక్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్స్ ఎ.హరనాథ్, సీహెచ్ వెంకటేశ్, ఎం.రామారావు పాల్గొని మాట్లాడారు.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



అరసవల్లి: డీసీసీ కార్యాలయంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

అరసవల్లి: స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో బుధవారం డీసీసీ అధ్యక్షుడు పరమేశ్వరరావు ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి బర్త్‌డే కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్మోహన్‌రావు, నాయకులు అంబటి కృష్ణారావు, డి.గోవిందమల్లిబాబు, కేవీఎల్ఎస్ ఈశ్వరి, సురేష్, నాయుడు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

- ఇచ్ఛాపురం: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ అలీమ్ ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో చాట్ల అజిత్ కుమార్ రెడ్డి, ఎన్.ధర్మ, ముకుంద, గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐలో 112 మంది ప్రవేశాలు

ఎచ్చెర్ల: జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశానికి ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో బుధవారం జరిగిన రెండో రోజు కౌన్సెలింగ్‌లో వివిధ ఐటీఐల్లో 112 మంది చేరారు. ఈ కౌన్సెలింగ్‌కు మొత్తం 464 మంది హాజరు కావల్సి ఉండగా, 201 మంది కౌన్సెలింగ్ హాజరుకాగా 112 మంది సీట్లు పొందారు. గురువారం 878 నుంచి 1399 ర్యాంకు వచ్చిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈనెల 23వ తేదీ వరకు ఈ కౌన్సెలింగ్ జరగనుంది. ఈ కౌన్సెలింగ్ జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎస్.సుధ, జిల్లా అడ్మిషన్ల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.

## వేలం పాట ఖరారు

గార: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మం దేవస్థాంలో బుధవారం నిర్వహించిన వేలం పాట ఖరారైనట్టు ఆలయ ఈవో గురునాథరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండేళ్ల కాల పరిమితికి కొబ్బరి చెక్కలు లైసెన్సుకు బి.ఉషారావు, పూజా సామగ్రి షాపునకు కె.శ్రీనివాసరావు, చెప్పుల స్టాండ్‌కు ఎన్.ఈశ్వరరావు హక్కులు పొందారన్నారు. ఈ వేలం పాట ఆలయం వద్ద బుధవారం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

## రైతులందరికీ వరి విత్తనాలు

పొందూరు: మండలంలోని రైతులందరికీ ఖరీఫ్ సీజన్‌కు వరి విత్తనాలు అందిస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండల కేంద్రం మార్కెట్ కమిటీలో బుధవారం వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వంలో వరి విత్తనాల పంపిణీలో రైతులు ఎదుర్కొన్న సమస్యలు లేకుండా విత్తనాల పంపిణీ ఉంటుందన్నారు. మండలంలో మొదటి విడతలో 848 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని రైతులకు అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

### ఏవోపై ఆగ్రహం

ఏవో బి.బాజ్జీపై మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నెపు రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పార్టీ కార్యకర్తగా పనిచేశారని, మండలానికి వచ్చిన వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, పురుగుల మందుల్లో అవినీతి చేసినట్టు ఆరోపించారు. గత ఐదేళ్లలో మండలంలో పంపిణీ చేసిన వ్యవసాయ పరికరాల వివరాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బలగ శంకర భాస్కర్, ఎస్.శ్రీరంగ నాయకులు ఎ.చినరంగ, బాడాన గిరి, వండాన మురళి, అనకాపల్లి విజయలక్ష్మి, పి.లక్ష్మి, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

- ఆమదాలవలస: టీడీపీ హయాంలోనే రైతులకు మేలు కలగనుందని ఆ పార్టీ మండల నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని కొర్లకోట గ్రామంలో వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేని విద్యాసాగర్, ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, ఏవో మెట్ట మోహన్‌రావు, సర్పంచ్ సనపల చెల్లంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

ఆమదాలవలస: మహిళా స్వయంశక్తి సహాయక సంఘాల సభ్యులకు సికిల్ సెల్ ఎనీమియాపై డాక్టర్ సీహెచ్ మాధురి అవగాహన కల్పించారు. బుధవారం దూసి పీహెచ్‌సీ పరిధిలోని స్వయం శక్తి సంఘాలకు వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనలో పాల్గొని మాట్లాడారు. క్లస్టర్ కో-ఆర్డినేటర్ చంద్రరావు, వీవోఏలు సునీత, సువర్ణ, పావని, వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

## జర్నలిజానికి వన్నెతెచ్చిన రామోజీరావు

ఇచ్ఛాపురం: జర్నలిజానికే వన్నెతెచ్చిన మహోన్నత వ్యక్తి ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలలో దివంగత రామోజీరావు సంస్మరణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు, వైద్యులు శిల్ప, శ్రీకన్య, పురుషోత్తం, కూన విష్ణుమూర్తి, పూడి కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

గార: బడి బయట పిల్లల్ని గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ పూడి జనార్దనరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కుమ్మరిపేటలో స్థానిక భవిత కేంద్రం వద్ద 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బడిలోనే ఉండాలి

కంచిలి: బడిఈడు పిల్లలంతా బడికి వెళ్లి విద్యాభ్యాసం చేయాలని ఎంఈవో శివరాం ప్రసాద్ అన్నారు. పద్మతుల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ వీధుల్లో నినాదాలు చేసి ర్యాలీ చేపట్టారు. ఎంఈవో-2 చిట్టిబాబు, కృష్ణారావు, తారక్, గోపి, శ్రీను, భాస్కరరావు, శ్రీను, చంద్రశేఖర్, శ్రీలక్ష్మి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.